# బానిసలు

వసుంధర

కొత్తగా చేరాను ఆఫీసులో- జూనియర్ ఆఫీసరుగా!

ఆఫీసులో నాపైన ఒక సీనియర్ ఆఫీసరున్నాడు. ఆయన పేరు పర్వతాలరావు.

నా క్రింద యాభై మంది గుమస్తాలు, పదిమంది చప్రాసీలు- ఉన్నారు. చేతి నిండా పని నాకు.

ఒకప్పుడు పర్వతాలరావొక్కడే ఇంతమందినీ చూసుకునేవాడు. పనెక్కువయిందని జూనియర్ ఆఫీసరుపోస్టు సృష్టించాడాయన. దానికి పై అధికారుల ఆమోదం లభించింది. నేను అపాయింటయ్యాను.

ఎమ్మేలో ఎకనామిక్సు నా సబ్జక్టు. పిహెచ్‌డీ చేయాలని ప్రొఫెసరుగారిని కలుసుకుంటే ఆయన రెండేళ్ళాగి రమ్మన్నాడు.

ఆ రెండేళ్ళూ నేను నిరుద్యోగిని.

ప్రొఫెసరుగారి దగ్గరకు వెడితే- "ఈపాటికి నీకుద్యోగం వచ్చేసి ఉంటుందనుకున్నానే- సరేలే-" అని నన్ను చేర్చుకున్నాడు.

ఒక ఏడాదిపాటు నాకే స్కాలరుషిప్పూ లేదు. అటు స్కాలరుషిప్పులకూ ఇటు ఉద్యోగాలకూ కూడా అప్లై చేస్తున్నాను. ఆ సమయంలో నెలకారు వందల స్కాలర్‌షిప్పూ, ఈ ఉద్యోగమూ ఒకేసారి వచ్చాయి నాకు.

"ఏం చేద్దామనుకుంటున్నావు?" అన్నాడు ప్రొఫెసరుగారు.

"ఉద్యోగమెప్పుడైనా వస్తుంది. పిహెచ్‌డీ చేస్తాను-" అన్నాను.

"పిహెచ్‌డీ ఎప్పుడైనా వస్తుంది. ఉద్యోగంలో చేరు-" అన్నాడాయన.

కానీ నాలో ఇంకా విద్యాతృష్ణ తీరలేదు. అదే ఆయనకు చెబితే- "నీకు ప్రపంచ జ్ఞానంలేదు. ఉద్యోగమెలా చేస్తావో ఏమిటో-" అని జాలిపడ్డాడు తప్ప పిహెచ్‌డీ పూర్తిచేయడానికి ఒప్పుకోలేదు.

నేనుద్యోగంలో చేరాను.

ఉద్యోగం గురించి నాకెన్నో ఆశయాలున్నాయి.

నా ఎమ్మే డిగ్రీ చూసి నాకుద్యోగమిచ్చారు. నా ఎకనామిక్సుతో ఉద్యోగానికి పనిలేదు. అంటే చదివిన చదువు నాకేతప్ప దేశానికి ఉపయోగపడడం లేదు. అందువల్ల నేనైనా దేశానికుపయోగపడాలన్నది నా ఆశయం.

నిజాయితీగా ఉండాలి. సమయం వృథాకాకుండా పనిచేయాలి. నా క్రింది వారిపనులన్నీ నేనుకూడా నేర్చుకుని అందులోని సాధకబాధకాలు తెలుసుకోవాలి. అన్నింటికీ మించి నేను వారికాదర్శంగా ఉండాలన్నది నా ముఖ్యాశయం.


అయితే ఆఫీసులో వాతావరణం మరొకలాగుంది.

నా క్రిందివారంతా నేను కనబడగానే లేచి నిలబడుతున్నారు. నేను నా గదిలోకి పిలిస్తే నాతో వంగి వినయంగా మాట్లాడుతున్నారు. నేను సూచనలిస్తే మంచిచెడ్డ లాలోచించకుండా ఒప్పేసుకుంటున్నారు. నాతో మాట్లాడే ప్రతిమాట చివరా సర్ అన్నపదం ఉపయోగిస్తున్నారు.

ఇందుకు నేను బాధపడ్డాను. నా క్రింద పనిచేస్తున్న గుమస్తాలలో నలభై మంది వయసులో నాకంటె పెద్దవారు. ఇద్దరు నా వయసువారు. ఎనమండుగురు మాత్రం నాకంటె కాస్త చిన్న.

ఒకరోజున నేను వారందరినీ పిలిచి- "మీరు నన్ను పై అధికారిలాకాక మీ స్నేహితుడిగా భావించండి. మనమందరం దేశసేవకై ఒకే సంస్థలో పనిచేస్తున్న సోదరులం. మీరు నన్ను సర్ అని పిలవద్దు. నన్నుచూసి భయపడవద్దు. ఆఫీసు పనిలో నా అభిప్రాయాలు సరైనవి కావని మీకు తోస్తే ఆ విషయం నాకు నిర్భయంగా చెప్పండి. ఇందులో వ్యక్తిగతమైనదేమీ లేదు. మనం తప్పుచేయకపోతే అందువల్ల దేశానికే లాభం! వ్యక్తులకుకాక దేశాన్ని దృష్టిలో ఉంచుకుని పని చేయాలి మనం-" అని చెప్పాను.

ఆరంభంలో నా మాటల నెవ్వరూ సీరియస్‌గా తీసుకోలేదు. కానీ నేను చిత్తశుద్ధితోనే ఆ మాటలు చెప్పానని వారు త్వరలోనే గ్రహించారు. ఆరు



మాసాల్లో వారిలో నేను కోరిన మార్పు వచ్చింది. ఆ కారణంగా నా క్రింది ఉద్యోగుల సమర్థత పెరిగి నాకు పేరు వచ్చింది.

ఒకరోజున పర్వతాలరావు నన్ను పిలిచి- "నువ్వు చాలా సమర్థుడివి. వారానికి పాతిక ఫైళ్ళు కదలని ఆఫీసులో ఇప్పుడు సునాయాసంగా రెండువందల ఫైళ్లుసునాయాసంగా కదుల్తున్నాయి ..." అన్నాడు.

అప్పుడాయనకు నేనేం చేసిందీ చెప్పాను.

"ఇది నేనూ విన్నాను. అందుకే నిన్ను పిలిచాను-" అన్నాడాయన.

నేనాయన చెప్పేది వినసాగాను.

భారతదేశం స్వతంత్రంగా ఉన్నది శతాబ్దాలక్రితం. విదేశీపాలనలో బానిస మనస్తత్వంనుంచి భారతీయులుసుమారు నాలుగు దశాబ్దాలుగా స్వతంత్ర వాయువులు పీలుస్తున్నప్పటికీ బయటపడలేక పోతున్నారు. అందుక్కారణమేమిటంటే-

బ్రిటిష్‌వారు బానిన దేశాన్నేలడానికి కొన్ని నియమావళులేర్పరచి అవి మన దేశంలో అమలుపరిచారు. స్వతంత్రం పొందినా భారతదేశం ఆ నియమావళులనే కొనసాగిస్తోంది. ఆ నియమావళి ప్రజలనెప్పటికీ బానిసలుగానే ఉంచుతుంది. అందువల్ల రాజకీయ నాయకులకు ప్రయోజనాలుండబట్టి వారా నియమావళిని మార్చరు. బానిన మనస్తత్వంతో ప్రజలు ప్రచారాన్ని నమ్ముతారు. రాజరికం నశించినా పదవికి వారసత్వముంటుంది. బ్రిటిష్‌వారు విభజించి పాలించారు. అదే ప్రాతిపదికపై దేశాన్ని భాషలు, కులమతాలు పేరిట విభజించి పాలిస్తున్నారు రాజకీయ నాయకులు. అప్పుడు మననేలినది పాశ్చాత్యులు కావడంవల్ల గాంధీవంటి మహాత్ములు ప్రబోధిస్తే ప్రజలు తిరగబడ్డానికి సిద్ధపడ్డారు. ఇప్పుడలాంటి అవకాశం లేదు. ఒక మూలనుంచి వెన్నుపోటు పొడుస్తూనే- నేను మీవాణ్ణి- అని నాయకులు ప్రజలను మోసగించగలరు. ప్రజాసేవ అంటే ఏమిటో తెలియకుండా తమకోసం తాము జీవించినవారు- ఒక్కరోజులో ప్రచారసాధనాలనుపయోగించుకుని రాష్ట్రంలో దేశంలో ప్రధానస్థాయి నలంకరిస్తున్నారు.


ప్రభుత్వ కార్యాలయాల్లోని నియమావళి ఫైళ్ళను ముందుకు నడిపించదు. అపనమ్మకం ప్రాతిపదికపై ఏర్పడిన ఆ నియమావళి- దేశంలో బ్రిటిష్‌వారి ప్రతినిధిగా ఉంటూ- ప్రజల బానిస మనస్తత్వాన్ని నిలబెడుతోంది.

అపనమ్మకం అవినీతిని ఆపడం లేదు. అయినా నమ్మకం నియమావళికి ప్రాతిపదిక కావడంలేదు.

ఇదంతా ఎందుకు చెబుతున్నారు?" అన్నాను.

"నీ ఉద్యోగం నీవు సక్రమంగా చేయాలంటే నీవవలంబిస్తున్న పద్ధతి సరైనది కాదు. నీ క్రిందివారిని స్నేహితులుగా కాక బానిసలుగా భావించు. వారికి నీవంటే భయముండనీ అందర్నీ దగ్గరకు రానివ్వకు. నిన్ను మరీ ఎక్కువగా గౌరవించే కొందర్ని మాత్రం దగ్గరకు రానిచ్చి గుప్పిట్లో ఉంచుకో. వారి






ద్వారా రహస్యాలు సేకరిస్తూండు. అందర్నీ సఖ్యంగా ఉండనివ్వకు. ఒకరి మీద ఒకరిని గూఢచారుగా నియమించు. అప్పుడంతా నువ్వంటే భయపడతారు. నిన్ను గౌరవిస్తారు."

"అందువల్ల ఎఫిషియన్సీ తగ్గిపోదా?"

"ఎఫిషియన్సీకంటే అధికారం ముఖ్యమైనది. అధికారి అధికారిలాగుండాలి. క్రిందివారు బానిసల్లాఉండాలి. ఇది మన సమాజం ఆమోదించిన సిద్ధాంతం. నీ క్రింది ఉద్యోగులు నీ కాలికింది చెప్పుల్లాపడి ఉన్నప్పుడే నీ సమర్థత గుర్తించబడుతుంది. వారానికి రెండువందల ఫైళ్ళు కదిలితే- అది నీకెలాంటి ఖ్యాతీ తెచ్చిపెట్టదు-"అన్నాడు పర్వతాలరావు.

"ప్రజల్లోని ఈ బానిస మనస్తత్వానికి ఏదో ఒకరోజు స్వస్తివాచకం పలకాలి. అది నావంటివారితో ప్రారంభం కానివ్వండి-" అన్నాడు.

"మన నియమావళి మారేదాకా అది సాధ్యంకాదు-"

"ఎందుకు సాధ్యంకాదు? నేను మన ఆఫీసులో మార్పుతెచ్చానుగా!"

"ఆ మార్పు కేవలం నీవరకే! నా విషయంలో వారంతా ఎప్పటిలాగే ఉన్నారు. ఆఫీసులో నిన్ను గౌరవించకపోవడం నీకే చిన్నతనం...."

"మీరు కూడా మీ విషయంలో వారిని మార్చండి-" అన్నాను.

"నా విషయంలో వాళ్లు మారరు-"

"నన్ను మార్చమంటారా?"

పర్వతాలరావు కంగారుగా- "వద్దు నేనది సహించలేను-" అన్నాడు.

"ఎందుకని?"

"మార్పు నావట్ల వ్యతిరేకంగా ప్రోత్సహిస్తే తప్ప వారలా మారరు. నువ్వు వారినలా ప్రోత్సహించడం నేను సహించలేను. ఒక విషయం ఆలోచించు. నీవు వారి ఆలోచనల్లో మార్పు

తెచ్చావు. ఆ మార్పు వారికి నీ వరకూ మాత్రమే సహకరించింది. నాపట్ల వాళ్లెందుకు మారలేదు? అంటే వారిలో బానిస మనస్తత్వం పోలేదు. పోయినా ఏదో క్షణంలో అది మళ్ళీ తలెత్తుతుంది. ఇలాంటివారిని మార్చాలనుకోవడంచాలా తెలివితక్కువ.

నేను బదులివ్వలేదు. కానీ పర్వతాలరావు మాటలను సవాలుగా తీసుకున్నాను. ఒకరోజు స్టాఫందర్నీ పిలిచి- "మీరిక్కడ ఎవరికీ భయపడకండి. నాతోలాగే పర్వతాలరావుతోనూ మసలండి. ఆయన చాలా సంతోషిస్తారు-" అన్నాను.

వాళ్లు వినేసి వెళ్ళిపోయారు. తర్వాత బావయ్యనే పెద్దాయన నాదగ్గరకు వచ్చి- "బాబూ- నువ్వు కుర్రాడివి. వృద్ధిలోకి రావలసినవాడివి. పర్వతాలరావుగారి వ్యవహారాల్లో జోక్యం చేసుకోకు." అన్నాడు.

"పర్వతాలరావు గురించి నీకు బాగా తెలియదు. ఉదాహరణకు ప్రభాకరం విషయం చెబుతాను. ఒకసారి పర్వతాలరావుగారి భార్య బట్టలషాపులో చీర సెలక్టు చేసుకుని నూటయాభై రూపాయల చీరను వందకిమ్మంది. షాపువాడు పదిరూపాయలకంటే తగ్గనన్నాడు. ఆ సమయంలో అక్కడే వున్న ప్రభాకరం భార్యకూ చీర నచ్చి నూటనలభై కి తీసుకుంది. అప్పుడామెకు పర్వతాలరావుగారి భార్య తెలియదు. తర్వాత ఏదో పార్టీలో ఒకరినొకరుతెలుసుకున్నారు. ప్రభాకరం పర్వతాలరావుగారికి నంబర్ వన్ చెంచా. అయినాసరే అతడికి రావలసిన ప్రమోషన్ ఆగిపోయింది. అలా యిప్పటికి మూడుసార్లు జరిగింది. ప్రభాకరం ప్రమోషన్ కోసం పర్వతాలరావుగారి కాళ్ళావేళ్ళాపడుతున్నా పని జరగడం లేదు. అతడి భార్య తన భార్యను క్షమార్పణ అడగాలని ఆయన సూచించాడు. ప్రభాకరం భార్య అభిమానవతి. మీకాయన ఆఫీసరు కానీ నాకావిడ ఆఫీసరు కాదంటుందామె. ఇదీ పర్వతాల పద్ధతి-" అన్నాడు బావయ్య.

"ప్రభాకరం విషయం నేనుచూస్తాను. మీరు మీ పద్ధతులు పర్వతాలరావుగారి విషయంలో కూడా మార్చుకోగలరా?" అన్నానావేశంగా.

"హామీ యివ్వలేను. కానీ ప్రభాకరానికి న్యాయం చేయిస్తే ఆఫీసులో నీ మాటకు విలువ పెరుగుతుందని చెప్పగలను-" అన్నాడు బావయ్య.

ఆయన్నుపంపేసి ప్రభాకరం ప్రమోషన్ గురించిన ఫైలు తీశాను. అది చదివితే చాలా అన్యాయమనిపించింది.

ప్రభాకరం వర్కులో తేడా లేదు. అంతా కాన్ఫిడెన్షియల్ రిపోర్టుల్లో ఉంది. ఒక ఏడాది పూర్ అని ఉంది. మరు సంవత్సరం కూడా అంతే! ఆ తర్వాత ఫెయిర్! కనీసం గుడ్ అనిపించుకుంటే తప్ప ప్రమోషనివ్వరాదని పర్వతాలరావు కవరింగు లెటర్లో వ్రాశాడు.

ప్రభాకరం పర్వతాలరావుకు వ్యతిరేకంగా పై అధికారులకు పిటీషన్ పెట్టుకుని ఉన్నట్లయితే ఈఅన్యాయం బయటపడి ప్రభాకరానికి న్యాయం జరుగడంతో పాటు- పర్వతాలరావు ఇబ్బందుల్లో పడతాడు. పర్వతాలరావు కేసును ప్రభాకరానికి వ్యతిరేకంగా చేయడానికి తగిన శ్రద్ధ తీసుకోలేదని-ఎవరికైనా ఆ ఫైలును చూడగానే యిట్టే అర్థమవుతుంది. తనేం చేసినా ఎదురులేదన్న మొండి ధైర్యం పర్వతాలరావుకుంది.

మర్నాడు నేను ప్రభాకరాన్ని నా గదికి పిలిచి- "నీకు ప్రమోషనెందుకు రావడం లేదో తెలుసా?" అన్నాను.

"నా దురదృష్టం-" అన్నాడతడు.

"దురదృష్టం కాదు- ప్రయత్న లోపం-"

"ప్రయత్నించాను సర్- ఇక్కడ పర్వతాలరావు నాకెలాంటి బాసో- ఇంటిదగ్గర మా ఆవిడా అంతే- ఒప్పుకోవడం లేదు-"

ఆశ్చర్యపోయి ప్రభాకర్ వంక చూశాను. అతడు సిగ్గుపడడానికి బదులు బాధపడుతున్నాడు. తనకు ప్రమోషన్ రాకపోవడానికి తన భార్య కారణమన్న విషయమందరికీ తెలుసనే అతడనుకుంటున్నాడు. అది దాచిపెట్టాలని కానీ, సిగ్గుపడాల్సిన విషయమని కానీ అతడు భావించడంలేదు.

"నా ఉద్దేశ్యమది కాదు- నీ ప్రమోషన్ గురించి నువ్వు రిప్రజెంటేషనివ్వలేదు. అదీ ప్రయత్న లోపమంటే!

"అధికారుల కెదురుతిరిగి బ్రతకలేము సార్!"

"ఇందులో ఎదురుతిరగడమేముంది? నీకు న్యాయం జరిపించమని విన్నపం చేసుకుంటావు. అంతే!"

ప్రభాకరం తలవంచుకుని- నేను రిప్రజెంటేషనివ్వను. పర్వతాలరావుగారి మనసు మారేదాకా ఎదురుచూస్తాను-" అన్నాడు.

---

"నీ తరపున వాదించేందుకు లాయర్ ఎవరైనా ఉన్నారా" ముద్దాయిని అడిగాడు జడ్జి.

"లేదండి.... నా అంతట నేనే అబద్ధాలు చెప్పగలను."

—కె. వి. మధుసూదనరావు

కాకినాడ

---

నాకు చిరాకేసి- "నువ్వు స్వతంత్ర భారత పౌరుడిలాకాక బానిసలా ఆలోచిస్తున్నావు-" అన్నాను.

ప్రభాకరం తలెత్తి అదోలా నవ్వి- "సార్- ప్రజలెన్నుకున్న నాయకుణ్ణి ముఖ్యమంత్రిగాచేసేది ప్రజాప్రతినిధులు కారు, ఎక్కడో ఢిల్లీలో ఉండే ఓ పెద్ద మనిషి. ఆయన తల్చుకుంటే ఈనాటి ముఖ్యమంత్రి రేపు ఎమ్మెల్యేగా మారిపోతాడు. ఆదేమని ఎదురుతిరిగితే అయిపులేకుండా పోతాడు. అలాకాక ఎంతటి అవమానాన్నయినా భరించి దిగమ్రింగి సహనాన్ని ప్రదర్శిస్తే- ఏదో ఒకరోజున తిరిగి ఏ కేంద్ర మంత్రి పదవినో, పార్టీ అధికార పదవినో సంపాదించుకోగలుగుతాడు. ఈ స్వతంత్ర భారతదేశంలో ప్రజాబలమున్న నాయకులే న్యాయంకోసం పోరాడ్డానికి బదులు అన్యాయాన్ని సహించడం ఆదర్శంగా పెట్టుకున్నారు. నేను సామాన్యుణ్ణి సర్!" అన్నాడు.

ప్రభాకరం నేననుకున్నదానికంటె తెలివైన వాడని అర్థమయింది. అప్పు

అతడికి నేను ధైర్యం చెబుతూ- "దేశం పరిస్థితి చూసి నిరుత్సాహపడొద్దు. అది రాజకీయం. ఇక్కడలా కాదు. నేను నీకు సాయపడతాను. మనిషి మనిషిలా బ్రతకాలి. బానిస మనస్తత్వాన్ని విడచి పెట్టాలి...." అంటూ మొదలుపెట్టి- "నీ భార్య ఆత్మగౌరవం నీ కాదర్శం. అధికారుల ప్రభావం ఆఫీసు పొలిమేరలు దాటనివ్వకు-" అంటూ అతడి భార్యను అభినందించి- "నీ కేసు చాలా స్ట్రాంగు. ఒక్క రిప్రజెంటేషనిచ్చారంటే చాలు- నీకు మూడేళ్ళక్రితంనుంచే ప్రమోషన్ వస్తుంది-" అంటూ ఆశపెట్టాను.

"ఆలోచిస్తాను సార్!" అని వెళ్ళిపోయాడు ప్రభాకరం.

అతడి నిర్ణయంకోసం నేను చాలా ఆత్రుతగా ఎదురుచూస్తున్నాను. ఆ నిర్ణయంమీదనే ఆఫీసులోని ఇతరుల భవిష్యత్తు ఆధారపడి ఉంది.

వారంరోజులు గడిచాయి. ఒక రోజున బాపయ్య నా దగ్గరకు వచ్చి "ప్రభాకరానికి బ్యాక్‌డేట్‌తో ప్రమోషన్ వచ్చే అవకాశముందన్నావుట. అదెలా సాధ్యం?" అనడిగాడు. నేను వివరించి చెప్పగానే ఆయన కళ్లు మెరిశాయి. "నువ్వు తల్చుకుంటే అయిపోతుంది బాబూ. ఈ కాన్ఫిడెన్షియల్ సమాచారం నీవల్ల తప్ప బైటకురాదు-" అన్నాడు.

"మీ అందరికీ నా పూర్తి సహకారముంటుంది...." అన్నాను.

"నువ్వు మా అందరికీ సహకరించాలని ఎందుకనుకుంటున్నావ్?"

ఆయనకు నా ఆశయాలు చెప్పాను.

"పర్వతాలరావంటే నీకేమైనా వ్యక్తిగత ద్వేషముందా?"

"లేదు. ప్రభాకరంవంటి వారిగురించి తప్ప వ్యక్తిగతంగా మామధ్య ఏ విధమైన భేదాభిప్రాయాలూ లేవు...."

"రాజకీయంగా నీకేమైనా బలముందా? అంటే ఎవరైనా నీ ద్వారా పర్వతాలరావు ఆటలు కట్టించాలనుకుంటున్నారా?"

ఆయన ప్రశ్నలెందుకో నా కర్థంకాలేదు. ప్రతి విషయానికీ ప్రయోజనాన్నంటగట్టడం ఈనాటి సామాన్యుడి లక్షణం. అందులో కూడా బానిస మనస్తత్వం ప్రతిబింబిస్తున్నదేమో నాకు తెలియదు.

కేవలం వ్యక్తిగతమైన ఆదర్శాలతో నేనీ పోరాటానికి తలపడినట్లాయన్ను నమ్మించేసరికి నా తలప్రాణం తోకకు వచ్చింది. నాకు సంబంధించి నా చిత్తశుద్ధిని, సచ్ఛీలతను అన్నివిధాలుగా ఋజువుచేసుకుందుకు ప్రయత్నించాను.

అలా మరో పదిరోజులు గడిచాయి.

ఒకరోజున పర్వతాలరావు నన్ను పిలిపించాడు. చూడగానే ఆయన కళ్ళలోంచి కురుస్తున్న నిప్పుల్ని గుర్తించాను.

"నీ బుద్ధి పెడదారులు తొక్కింది. సాఫీగా సాగిపోతున్న ఆఫీసులో కలతలు సృష్టిస్తున్నావు. నా ఉద్యోగులను నాపైకి ఉసిగొల్పుతున్నావు-" అన్నాడాయన కోపంగా.

"ఎవరు చెప్పారు?" అన్నాను.

"ప్రభాకరం-"

నేను నమ్మలేదు. పర్వతాలరావు తన గూఢచారులద్వారా ఈ విషయం తెలుసుకుని నన్ను దబాయిస్తున్నాడనుకుని- "అంతా అబద్ధం!" అన్నాడు.

"అయితే ఇదేమిటి?" అన్నాడాయన. ఆయన చేతిలో ఓ కాగితముంది. అది నా కందించాడు.



తనకు ప్రమోషన్ రాకపోవడానికి పర్వతాలరావే కారణమనీ, ఆయనకు వ్యతిరేకంగా రిప్రజెంటేషన్ ఇవ్వమని తనను నేను ఫోర్సు చేస్తున్నాననీ ప్రభాకరం పర్వతాలరావుకు నా మీద వ్రాతమూలకంగా ఇచ్చుకున్న ఫిర్యాదు కాగితమది!

నాకు నోటమాట రాలేదు.

"ప్రభాకరం విషయం నాకు చెప్పకున్నాడు. వ్రాతమూలకంగా యివ్వమంటే యిచ్చాడు. అతడు నాకు నమ్మకస్తుడు. ప్రమోషనివ్వనందుకు నన్ను తప్పుపట్టే నీచ మనస్తత్వం అతడికి లేదు. ఇప్పుడీ కాగితంతో నిన్నేమైనా చేయగలను. కానీ నీ గురించి నాకు తెలుసు. నువ్వు మంచివాడివి. ఉడుకు రక్తం నీ మనసును పెడదార్లు తొక్కిస్తోంది. మనమిద్దరం కలిసుండడం ఇద్దరికీ మంచిది. నువ్వు దేశంగురించి, ప్రజలగురించి, తోటి ఉద్యోగులగురించి కాక నీ గురించి ఆలోచించడం నేర్చుకో. నిన్ను నువ్వు బాగుచేసుకుంటే దేశం దానంతటదే బాగుపడుతుంది. దేశం బాగుగురించి ఆలోచించావా- అది బాగుపడదు కానీ నువ్వు చెడిపోవడం తథ్యం. ఇది మొదటి హెచ్చరికగా- నిన్ను వదిలిపెడుతున్నాను. నా హెచ్చరికను లక్ష్యపెట్టకపోతే- ప్రభాకరం వ్యతిరేకంగా రాసిచ్చిన కాగితాన్ని నేనెప్పుడైనా ఉపయోగించగలను...."

నేనక్కణ్ణించి లేచి వెళ్ళిపోయాను.

ప్రభాకరం రిప్రజెంటేషనిచ్చి ఉంటే- నా సాయంతో అతడు తప్పక న్యాయం పొందగలిగి ఉండేవాడు. కానీ అతడు పర్వతాలరావుకు తన నిజాయితీని నిరూపించుకున్నాడు. తప్పు నా మాట వినలేదు.

నేను బాపయ్యను పిలిచి ప్రభాకరం చేసిన పని చెప్పాను. నా చిత్తశుద్ధిపై అతడు తీసిన దెబ్బగురించి ఆయనకు తెలుసుకోవాలనిపించింది.

బాపయ్య జరిగిందాని కాశ్చర్యపడలేదు.

"నీకు పర్వతాలరావుగారిపై వ్యక్తిగతమైన కక్షలేదు. నీ వెనుక రాజకీయ బలంలేదు. కేవలం ఆదర్శాలను నమ్ముకుని పోరాటానికి దిగే నిన్ను ప్రభాకరం ఎలా నమ్మగలడు? పర్వతాల

రావుగారి కాదర్శాలు లేవు. వ్యక్తిగత మైన కక్షలో ఎంతైనా చేయగల సమర్థుడాయన. ఆయన వెనుక రాజకీయ శక్తులున్నాయి. అలాంటివారికి బానిసలుగా పడి ఉండడంలోనే మాబోంట్లకు మనుగడ ఉంది. కేవలం మనుగడ గురించి ఆలోచించే మేము భవిష్యత్తు గురించి ఆలోచించలేము...." అని- "ప్రభాకరానికి గుట్టు తెలియదు. అందువల్ల అతడేమిటో చూడగానే అందరికీ తెలిసిపోతుంది. అలా తెలిసినా తెలియకున్నా మేమంతా కూడా అతడివంటివారిమే-" అనేసి వెళ్ళిపోయాడాయన.

బాపయ్య, ప్రభాకరం- వీరంతా చదువుకున్నవారు.

న్యాయం జరుగడం తప్పనిసరి అని తెలిసికూడా న్యాయంకోసం పోరాడక పోవడంలోనే తమకు మనుగడ ఉన్నదని భావిస్తున్నవారు- స్వతంత్ర భారత పౌరులు.

యథారాజా- తథాప్రజా అంటే ఏమిటో అనుకున్నాను.

తమనేలుకుందుకు ప్రజలెన్నుకున్న ప్రజాప్రతినిధులే బానిసలుగా మసలుతున్నంతకాలం- ప్రజలకు బానిస మనస్తత్వమెలా విడిచిపెట్టగలదు?

నేనాలోచిస్తున్నాను.

మార్పు నాక్రింది ఉద్యోగుల్లోకాదు- నాలోనే రావాలేమో!

